ఆరేళ్లుగా రాకపోకలకు అవస్థలు

ఏదుల-వీరాంజనేయస్వామి జలాశయంలో నాలుగు దారులు ముంపు



ఏదుల-వీరాంజనేయ స్వామి జలాశయం ప్రధాన దారిపై ఉన్న బురద

కోడేరు, కొల్లాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల - వీరాంజనేయస్వామి జలాశయంలో నాలుగు రహదారులు ముంపునకు గురయ్యాయి. ఆరేళ్లుగా రాకపోలకు తిప్పలు తప్పడం లేదు. రెండు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదు. మట్టిదారులకు బీటీ నిర్మాణం చేపట్టాలని నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇదీ సమస్య..: జలాశయంలో రెండు జిల్లాల రహదారులు ముంపునకు గురయ్యాయి. 2018 నుంచి బస్సుతో పాటు వివిధ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. కోడేరు మండలం తీగలపల్లి-నాగపూర్‌కు జలాశయంపై నూతనంగా మట్టిదారి వేశారు. వర్షాలు కురవడంతో బురదగా మారి వాహనాలు నడపలేని దుస్థితికి చేరింది. ఆర్టీసీ అధికారులు ఆగస్టులో 20 రోజులు బస్సులు నిలిపేశారు. కోడేరు-నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రయాణికులు, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. వనపర్తి జిల్లా ఏదుల-రేవల్లి మండలాల దారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోజుకు ఒక బస్సు తిరుగుతుండటంతో ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వనపర్తి, నాగర్‌కర్నూల్ పట్టణాలకు ప్రయాణించాలంటే బస్సుల సమస్య ఉంది. మట్టిదారులకు బీటీ పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. నీటిపారుదల శాఖ ఈఈ రవీందర్‌ను వివరణ కోరగా మట్టిదారులకు బీటీ పనులు చేసేందుకు త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. అసంపూర్తి దారులు పూర్తి చేస్తామన్నారు.

రూ. 34.50 కోట్లు మంజూరు


పాలమూరు ప్రాజెక్టులో భాగంగా ఏదుల-వీరాంజనేయస్వామి జలాశయం రెండో దశ నిర్మాణ పనులు 2018లో పూర్తయ్యాయి. కోడేరు మండలంలోని తీగలపల్లి-నాగపూర్ 6.85 కిలో మీటర్లు, తీగలపల్లి శివారులోని కాకులగట్టు-ఏదుల దారి వరకు 1.25 కిలోమీటర్లు, వనపర్తి జిల్లాలోని ఏదుల-రేవల్లి 5.2 కిలో మీటర్లు, నాగపూర్-రేవల్లి అర కిలోమీటర్ వరకు ప్రధాన రహదారులు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం ఆయా గ్రామాలకు బీటీ రహదారుల నిర్మాణానికి రూ. 34.50 కోట్లు మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులు చేపట్టిన సంబంధిత ఏజెన్సీ గుత్తేదారులు మట్టిదారులతో పాటు బీటీ పనులు చేయాల్సి ఉంది. మూడు దారులను మట్టితో నిర్మాణం చేశారు. తీగలపల్లి శివారులోని కాకులగట్టు-ఏదుల దారి వరకు పనులు మొదలు పెట్టలేదు.

పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే : నక్కలగండి జలాశయంలో ముంపునకు గురైన వ్యవసాయ భూములకు నష్ట పరిహారం అందించాలని నిర్వాసిత గిరిజన రైతులు జిల్లా కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. మన్నెవారిపల్లి శివారులోని సర్వేనంబర్ 148లో 62 ఎకరాలు ముంపునకు గురైందన్నారు. 2005-06లో జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ స్కీం, ఏఎంఆర్‌పీ ప్రాజెక్టు వారు పరిహారాన్ని నల్గొండ జిల్లా అధికారులు ఇస్తారని చెప్పినట్లు వివరించారు. పరిహారం అందే వరకు ఎకరాకు రూ.7,500 అందిస్తామని 2007లో ఒప్పందం చేసుకొని రెండు పంటలకు మాత్రమే ఇచ్చారని వాపోయారు. అధికారులు పరిహారం అందించాలని కోరారు.

వేగానికి కళ్లెమేదీ?

జాతీయ రహదారి-44పై తగ్గని ప్రమాదాలు



జాతీయ రహదారి-44పై స్పీడ్‌గన్‌తో వాహన వేగాన్ని పరిశీలిస్తున్న అధికారి

న్యూస్‌టుడే, భూత్పూర్, పాలమూరు

జాతీయ రహదారి-44పై ప్రమాదాలతో నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనదారులు అతివేగంగా దూసుకెళ్లటం, కూడళ్లు, మలుపుల వద్ద వాహన వేగాన్ని నియంత్రించలేకపోవడమే ఈ ప్రమాదాలకు కారణమవుతోంది. స్పీడ్‌గన్‌తో వేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించటం మహబూబ్‌నగర్ జిల్లాకే పరిమితమవుతోంది. ఫలితంగా వాహనాల వేగానికి కళ్లెం పడక రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గటం లేదు. జాతీయ రహదారి-44పై నెలకొన్న పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

మహబూబ్‌నగర్‌లోనే స్పీడ్‌గన్ : ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అతివేగంగా వెళ్లే వాహనాలను గుర్తించేందుకు స్పీడ్‌గన్ వాహనాలు అందించాలని నిర్ణయించారు. రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి జిల్లాకు ఒక వాహనాన్ని కేటాయించారు. ఆ సమయంలో కొత్తూరు నుంచి మానవపాడు మండలంలోని పుల్లూరు వరకు వాహనం తిరుగుతూ వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. జిల్లాల విభజన తర్వాత స్పీడ్‌గన్ వాహనం మహబూబ్‌నగర్‌కే కేటాయించటంతో ఈ జిల్లా పరిధిలోనే వినియోగిస్తున్నారు. వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలో కెమెరాలతోనే పోలీసులు వాహన వేగాన్ని గుర్తించి, జరిమానా విధిస్తున్నారు. వాహనం ఒకటే కావటం, ఒకే జిల్లాకు పరిమితవటంతో వాహనదారుల్లో జరిమానాల భయం లేకుండా పోయింది. మరిన్ని వాహనాలు కేటాయించాల్సిన అవసరముంది.

ఏడాదికి 40వేల పైనే.. : మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ రహదారిపై రోజూ ఒకటి, రెండు ఠాణాల పరిధిలో స్పీడ్‌గన్ వాహనం వినియోగిస్తున్నారు. 2023లో అతివేగంగా వెళ్లిన 40,298 వాహనాలను గుర్తించి రూ.1,035 చొప్పున జరిమానా విధించారు. 2024లో ఆగస్టు వరకు 20,200 వాహనాలకు జరిమానా విధించారు. వేగంగా వెళ్తున్న వాటిలో కార్లు, ప్రైవేటు బస్సులే ఎక్కువ ఉంటున్నాయి.

అటకెక్కిన తనిఖీలు....: గతంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు నిత్యం రహదారులపై తనిఖీలు నిర్వహించేవారు. కొన్నేళ్ల నుంచి ఎంవీఐ కింద ఏఎంవీఐలు ఉండకపోవటంతో తనిఖీలు జరగడం లేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాల్లో ఆర్టీఏ కార్యాలయాలు ఉన్నాయి. పెబ్బేరు, కల్వకుర్తిలో ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. తగినంత మంది ఏఎంవీఐలు లేక జాతీయ రహదారులపై తనిఖీలు ఉండటం లేదు. పోలీస్, ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్టీఏ శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయి.

పరిమితికి మించి..

బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, ఇటిక్యాల, ఉండవల్లి (పుల్లూరు) మండలాల మీదుగా జాతీయ రహదారి-44 వెళ్తోంది. రహదారిపై 80 కి.మీ.లు, కూడళ్లు, మలుపుల వద్ద 40 నుంచి 60 కి.మీ.ల మధ్య వేగంతోనే వాహనాలు వెళ్లాలి. గతేడాది ఈ రోడ్డుపై మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 85 ప్రమాదాలు చోటుచేసుకుంటే 35 మంది మృతిచెందారు. 463 మంది గాయపడ్డారు.



సంయుక్త తనిఖీలు చేపడతాం : వాహనదారులు 80 కి.మీ.ల వేగంతో వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించడానికి అనుబంధ శాఖలతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తాం. మొదట ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ గన్ వినియోగిస్తాం.

- డి.జానకి, జిల్లా ఎస్పీ, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈనెల 2న వరద నీటితో వెంకటాద్రి పంప్‌హౌజ్ మునిగిపోయిందని, అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఇప్పటికీ పంపు హౌజ్‌లోని నీటిని తోడలేదని విలువైన మోటార్లు చెడిపోకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి తోడివేతను వేగవంతం చేయాలని సూచించారు. జూరాల, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. సీఎం స్వయంగా వచ్చి ప్రాజెక్టులను పరిశీలించి కార్యచరణను రూపొందించాలని సూచించారు.

జూరాలకు పెరిగిన వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వస్తున్న వరద పెరిగింది. జలాశయంలోకి 51వేల క్యూసెక్కులు చేరుతుండగా, 3 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా దిగువకు 58 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. ఆలమట్టిలోకి 14వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు 11 వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 11,800 క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 20వేల క్యూసెక్కులు వదులుతున్నారు. జూరాలకు పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా వరద పెరిగినట్లు అధికారులు వివరించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కందనూలు, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే డా.రాజేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వివిధ రకాల క్రీడల్లో రాణించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పాండు, ఉపాధ్యాయులు వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే డా. రాజేశ్‌రెడ్డి



జల్లంత.. తుళ్లింత!

వర్షాలతో ప్రకృతి ఆహ్లాదకరంగా మారడంతో మయూరాల సందడి పెరిగింది. మంగళవారం ఉదయం భూత్పూర్ మండలం కొత్తమొల్గర శివారులో మూడు నెమళ్లు ఇలా హద్దురాళ్లపై ఒళ్లు విరుచుకుంటూ కనిపించగా 'ఈనాడు' క్లిక్ మనిపించింది. **- ఈనాడు, మహబూబ్‌నగర్**

సమగ్ర సాగుతోనే ప్రయోజనం




కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డ్ జీఎం సుశీల

బిజినేపల్లి, న్యూస్‌టుడే : సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రైతుకు ప్రయోజనం చేకూరుతుందని నాబార్డ్ జనరల్ మేనేజర్ సుశీల అన్నారు. మంగళవారం బిజినేపల్లి మండలం పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు ఒకే విధమైన పంటలు పండించడం ద్వారా కీటకాల సంతతి వృద్ధి చెంది, క్రిమి సంహారక మందుల వినియోగం అధికమవుతుందన్నారు. తద్వారా పంట విషతుల్యం అవుతుందన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన కోళ్లు, గొర్రెల పెంపకం వంటి వాటిని చేపట్టాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డా.జమున రాణి, ఏడీఆర్ డా. మల్లారెడ్డి, కేవీకే సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి, డా.పుష్పవతి, డా.మీరా, డా. గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరుగు పెట్టేనా!

పాలమూరులో నేడు మంత్రుల పర్యటన



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలోని నార్లపూర్ పంపుహౌజ్ ప్రాంతం

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను పరుగు పెట్టించడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. జులైలో సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో పాలమూరు ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మిత ప్రాజెక్టులను వచ్చే ఏడాది డిసెంబరు చివరినాటికి పూర్తి చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. సమీక్ష జరిగి రెండు నెలలైనా అనుకున్న పురోగతి మాత్రం లేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు నిర్మిత ప్రాజెక్టుల పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ. 2,792.6 కోట్లు కేటాయించినా పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో పనుల పరిశీలన, పురోగతిపై సమీక్ష కోసం బుధవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పర్యటిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎటూ తేలని వైనం..: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై అధికారుల్లోనూ సందిగ్ధత నెలకొంది. ఈ పనుల కొనసాగింపుపై ప్రభుత్వం నుంచి సరైన దిశానిర్దేశం లేకపోవడంతో మిగిలిన వాటిపై ప్రభావం పడుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి వరదనీరు వచ్చినా నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేదు. ఇప్పటికే నార్లపూర్, ఏదుల, వట్టెం పంపుహౌస్‌ల్లో నాలుగు పంపుల చొప్పున పనులు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వట్టెం పంపుహౌస్‌లోకి వరదనీరు వచ్చి చేరింది. ఈ నీటిని తోడేందుకు కనీసం రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. నార్లపూర్ నుంచి ఏదుల వరకు అర కిలోమీటర్ మేర కాలువ పనులు పూర్తి కాలేదు. ఉదండాపూర్‌లో పంపుహౌస్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టు రెండో దశలో టెండర్లు పూర్తయిన కాలువ పనులను ప్రస్తుతానికి పక్కన పెట్టారు.

నిర్మిత ప్రాజెక్టులపై.. : ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, కోయిలసాగర్, భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల ద్వారా 6.39 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతోంది. అదనపు ఆయకట్టు పనులు పూర్తయితే మొత్తం 8.80 లక్షల ఎకరాలకు సాగునీరందే పరిస్థితి ఉంది. ఈ పనులు పూర్తి చేయడానికి గత బడ్జెట్‌లో రూ.1,469 కోట్లు కేటాయించారు. కాలువల నిర్మాణం, పునరావాస చర్యలు, భూసేకరణ వంటివి చేయాలి. ప్రస్తుతం భారీ వర్షాలకు జలాశయాలు నిండటం, కాలువల్లో నీరు పారుతుండటంతో అదనపు ఆయకట్టు పనులపై ప్రభావం చూపనుంది. కొత్తకోటలోని కానాయపల్లి వద్ద శంకరసముద్రం జలాశయం పరిధిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా పునరావాస ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీనికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. గద్వాల జిల్లాలోని గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా ర్యాలంపాడు నుంచి నీటిని తరలించాలని భావించినా దీని డిజైను మార్చాలన్న చర్చ జరిగింది. జూరాల జలాశయం పరిధిలోని బ్యాక్‌వాటర్ ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పరిధిలోని రెండోదశ పనులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మంత్రుల పర్యటన ఇలా..

ఉదయం 10:15 : జడ్చర్లలోని ఉదండాపూర్ జలాశయం పనుల పరిశీలన

ఉదయం 11:15 : గట్టు ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన

మధ్యాహ్నం 1:00 : కొత్తకోట మండలంలోని శంకరసముద్రం జలాశయం పరిశీలన

మధ్యాహ్నం 3:00 : పీఆర్‌ఎల్‌ఐలో భాగంగా నార్లపూర్ జలాశయం పనుల పరిశీలన

సాయంత్రం 4:30 : వట్టెం రాక జలాశయం పనుల పరిశీలన

సాయంత్రం 5:15 : నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

యువత చొరవతోనే సత్ఫలితం

కందనూలు, న్యూస్‌టుడే : పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నియంత్రించడానికి, గ్రామాల్లో మత్తు పదార్థాల సరఫరా అరికట్టడానికి యువత స్వచ్ఛందంగా స్పందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. స్వరాజ్యలక్ష్మి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని నాగనూల్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. పొగాకు వినియోగంతో కలిగే అనర్థాలపై 60 రోజుల పాటు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. యువత భాగస్వామ్యంతో సత్ఫలితాలు సాధ్యమని ఇందుకు అందరూ చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డా. వెంకట్‌దాస్, జిల్లా టీకాల పర్యవేక్షణాధికారి డా. రవికుమార్, డీపీవో రేణయ్య, మండల వైద్యాధికారి డా. నారాయణస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. స్వరాజ్యలక్ష్మి

దరిచేరని ఆరోగ్య లక్ష్మి

అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనానికి అంతంతే స్పందన

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం : పుట్టబోయే బిడ్డ తగిన బరువుతో ఆరోగ్యంగా ఉండాలని, బాలింతలకు తగిన పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరోగ్య లక్ష్మి' పథకం లక్ష్యానికి పూర్తిగా దూరమైంది. ఈ పథకం అమలుపై స్త్రీశిశు సంక్షేమ శాఖ చెబుతున్న లెక్కలకు క్షేత్రస్థాయి పరిస్థితికి ఎలాంటి పొంతన ఉండటం లేదు. పల్లెలు, పట్టణాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వాటి పరిధిలోని బాలింతలు, గర్భిణులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు రావాలి. 80 నుంచి 90 శాతం మంది లబ్ధిదారులు రావటం లేదు.

పెరిగిన సమస్యాత్మక ప్రసవాలు : ఆరోగ్య లక్ష్మి పథకం కింద మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు, పుట్టిన శిశువుకు ఆరు నెలలు నిండే వరకు తల్లి(బాలింత)కి అన్నం, పప్పు, చారు, ఉడకబెట్టిన గుడ్డు అందిస్తారు. లాక్‌డౌన్ సమయంలో, అంతకు ముందు ఇంటి వద్దే వండుకుని తినమని గర్భిణులు, బాలింతలకు పప్పు, నూనె, గుడ్లు, పోషక విలువలతో కూడిన బియ్యాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసేవారు. దాదాపు మూడేళ్లు ఇలా అమలు కాగా అందరూ సరకులు తీసుకునేవారు. 2021 సెప్టెంబరు నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకే వచ్చి భోజనం చేయమని ఆదేశాలు రావడంతో అప్పటి నుంచి భోజనానికి వచ్చేవారి సంఖ్య పూర్తిగా పడిపోయింది. రోజూ కూలీనాలీ చేస్తే తప్ప పూట గడవని కుటుంబాలే అధికంగా ఉండటం, దూరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణులు, బాలింతలు నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి లేకపోవటమే ఇందుకు కారణం. పల్లెల్లో గర్భిణులు, బాలింతలు వ్యవసాయం, కూలీ పనులకు వెళ్తుంటారు. వారు మధ్యాహ్నం కేంద్రాలకు రాలేని పరిస్థితి. పట్టణాల్లో రకరకాల పనులు చేసుకునే పేదలు, మధ్య తరగతి వాళ్లు అంగన్‌వాడీ కేంద్రాలకు రావటం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో చాలా మంది శిశువులు తక్కువ బరువుతోనే జన్మిస్తున్నారు. గర్భిణులు రక్తహీనతతో బాధపడటం వల్ల ప్రసవం సమస్యాత్మకం(హైరిస్క్)గా మారుతోంది. తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువులకు చికిత్సలు చేయించేందుకు కుటుంబాలు రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. కొందరు గర్భిణులు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు.



ఈనాడు పరిశీలన

నవాబుపేట అంగన్‌వాడీ కేంద్రంలో 9 మంది లబ్ధిదారులు ఉండగా భోజనానికి వచ్చింది ముగ్గురే

తప్పుడు లెక్కలతో సరకులు పక్కదారి..



అంగన్‌వాడీ కేంద్రాల్లో 8 నుంచి 10 మంది వరకు గర్భిణులు, బాలింతలు ఉంటున్నారు. ఒకరిద్దరు కూడా భోజనానికి రావటం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో 13,202 మంది లబ్ధిదారులకు ఉంటే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి 10,865 మంది (82 శాతం) భోజనం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నాగర్‌కర్నూల్‌లో 13,151 మందికి గాను 9,353 మంది (71శాతం), వనపర్తిలో 9,421 మందికి గాను 5,439 (57శాతం), జోగులాంబ గద్వాలలో 11,102 మందికి గాను 8,790 (79శాతం), నారాయణపేట జిల్లాలో 12,280 మందికి గాను 8,928 మంది (72 శాతం) భోజనం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కలు పచ్చి అబద్ధమని ఏ కేంద్రానికి వెళ్లి పరిశీలించినా, లబ్ధిదారులను అడిగినా తేలిపోతుంది. లబ్ధిదారులు రాక వారి కోసం కేంద్రానికి వచ్చే సరకులు పక్కదారి పడుతున్నాయి. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల వాళ్లు రేషన్ దుకాణంలోనే బియ్యం అమ్మేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి జరీనా బేగంని 'న్యూస్‌టుడే' సంప్రదించగా గర్భిణులు, బాలింతలందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనం చేసేలా టీచర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు నిత్యం తనిఖీలు చేస్తూ పరిస్థితిని చక్కదిద్దితేనే పథకం లక్ష్యం నెరవేరే అవకాశముంది.



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం శుచిగా ఉండటమే కాదు.. వండటానికి కూడా కాస్త శుభ్రంగా ఉండాలి. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదులు అధ్వానంగా ఉన్నాయి. కొన్నింటికి పైకప్పు కూడా లేదు. అపరిశుభ్ర వాతావరణంలో వంట చేస్తుండటం విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తోంది. ఏళ్లుగా ఈ సమస్యలు ఉన్నా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. మహబూబ్‌నగర్ పురపాలిక పరిధి పాలకొండలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తి పైకప్పు ఉన్న రేకుల షెడ్డులో వంట చేస్తున్న దృశ్యమిది.
- ఈనాడు, మహబూబ్‌నగర్

మన లడ్డూలు అంతంతే..!




పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం

కొల్లాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రఖ్యాత తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యి నాణ్యతపై భక్తుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో లడ్డూ ప్రసాదంపై ఆసక్తి నెలకొంది. ఆలయాల్లోని లడ్డూ ప్రసాదం నాణ్యత ఎవరూ పట్టించుకున్న దాఖలా లేదు. తక్కువ ధరకు టెండర్లు నిర్వహించడంతో, లడ్డూ రూ.15కే విక్రయించాలని నిర్ణయించడంతో తయారీలో నెయ్యి వాడే పరిస్థితి లేక కేవలం (రిఫైండ్) వంట నూనె మాత్రమే వినియోగిస్తూ లడ్డూలు తయారు చేస్తున్నారు. దీంతో లడ్డూ నాణ్యత ఉండకపోగా.. పైగా అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి. కొవ్వు సంబంధిత ఆయిల్ వినియోగిస్తే దగ్గు, ఉబ్బసం తదితర రోగాలు దరిచేరే అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో.. : ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 48 ప్రధాన ఆలయాలున్నాయి. దేవాదాయశాఖ వీటిని 6ఎ, 6బి, 6సి కేటగిరీలుగా విభజించింది. ఎక్కువ ఆదాయం, ప్రాముఖ్యం పొందిన ఆలయాలను 6ఎలో చేర్చారు. మన్యంకొండ వేంకటేశ్వరాలయం, జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయం, జమ్ములమ్మ ఆలయం, మక్తల్ వేంకటేశ్వరాలయం, కాకర్లపాడు మైసమ్మఆలయం, గంగాపురం లక్ష్మి చెన్నకేశవాలయం, ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయం, రంగాపూర్ ఉమామహేశ్వరాలయం, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం, సిరసన గండ్ల సీతారామాలయం, నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం, అమ్మాపూర్ కురుమూర్తి ఆలయం, సింగోటం లక్ష్మీనర్సింహ ఆలయం, తిమ్మారెడ్డిపల్లి గురులోక మాసంద ప్రభు మందిరం, వనపర్తి, కొత్తకోట, శ్రీరంగాపూర్‌లోని వనపర్తిరాజావారికి సంబంధించిన గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఉన్నాయి.

కొన్నిచోట్ల గుడిలోనే..

ఆలయాల ప్రసాదాల తయారీలో ముఖ్యంగా లడ్డూ తయారీ కేవలం కొన్ని ఆలయాల్లో స్వయంగా తయారుచేస్తున్నారు. వీటిలో మన్యం కొండ, జోగులాంబ, మద్దిమడుగు, బీచుపల్లి, ఉమామహేశ్వరం ఆలయాల్లో మాత్రం లడ్డూల తయారీ ఉంటోంది. మిగతా అన్ని దేవాలయాల్లో టెండర్ల ద్వారా మాత్రమే లడ్డూ ప్రసాదం విక్రయాలు చేస్తున్నారు. ఇందులో ఒక్క బీచుపల్లి ఆలయంలో మాత్రమే లడ్డూల తయారీలో నెయ్యి వినియోగిస్తుండటం విశేషం.

6బి జాబితాలో..

మక్తల్ పడమటి ఆంజనేయస్వామి ఆలయం, గూడెబల్లూర్ వేంకటేశ్వరాలయం, చిన్నరాజమూరు ఆంజనేయస్వామి ఆలయం, చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, కందూరు రామలింగేశ్వర ఆలయం, వేంకటేశ్వర ఆలయం వనపర్తి ఉన్నాయి. గ్రూప్ 6సిలో బుద్దారం గండిఆంజనేయస్వామి ఆలయం, మావిళ్లపల్లి లక్ష్మీనర్సింహ ఆలయం ఉన్నాయి.

నాణ్యత ఎంత..

ఆలయాల్లో లడ్డూ ప్రసాదం భక్తులకు అందించేందుకుగాను టెండర్లు పిలుస్తున్నారు. ఒక లడ్డూ ధర కేవలం రూ.15 మాత్రమే నిర్ణయించడంతో ఉమ్మడి జిల్లా అంతటా లడ్డూ తయారీలో పేరున్న కంపెనీ నూనె వినియోగిస్తున్నారు. కేవలం 75 గ్రాముల నుంచి 80 గ్రాముల బరువు ఉండేలా లడ్డూ తయారీలో కేవలం నెయ్యి వినియోగించాలన్న నిబంధన ఏదీ టెండర్లలో పేర్కొనకపోవడంతో లడ్డూలు నాణ్యతలేని నూనె వినియోగించి తయారుచేస్తున్నారని ఆరోపణలున్నాయి. తక్కువ ధరలో లడ్డూల విక్రయం లక్ష్యంగా ఆలయాలు ఎలా సమకూర్చుకున్నా కారణంతో గుత్తేదారులు నూనె వినియోగిస్తున్నారు. లడ్డూ నాణ్యతపై అక్కడక్కడ చిన్నచిన్న ఫిర్యాదులు వచ్చినా.. ఆయా చోట్ల దేవాదాయశాఖాధికారులు స్పందించి చర్యలు చేపడుతున్నారు. ఆలయాల వద్ద లడ్డూ విక్రయాలు భక్తులు రాకపోకలు సాగించే చోట అపరిశుభ్ర వాతావరణంలో చేపడుతుండటంతో భక్తులు అనారోగ్యాలకు గురయ్యేప్రమాదం ఉంది.

ప్రసాదం నాణ్యతకు ప్రాధాన్యం..

ఆలయాల్లో లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యత ఉండేలా గుత్తేదార్లపై ఒత్తిడి తెస్తున్నాం. రిఫైండ్ ఆయిల్ వినియోగించి లడ్డూలు తయారుచేస్తున్నారు. లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.
- మదనేశ్వర్‌రెడ్డి, సహాయ కమిషనర్, దేవాదాయశాఖ, ఉమ్మడి మహబూబ్‌నగర్

విద్యుత్తు అధికారుల గొడవ.. విచారణకు ఆదేశం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో డీఈ పవర్‌హౌజ్‌లో ఏఈ, లైన్‌మెన్ ఘర్షణ పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని విద్యుత్ నియంత్రిక చుట్టూ ముళ్ల పొదలు, చెత్తాచెదారం తొలగించేందుకు అదనపు సిబ్బందిని పురమాయించే విషయంలో ఏఈకి, లైన్‌మెన్‌కు మధ్య మాటామాటా పెరిగి కొట్టుకునే వరకు వెళ్లినట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం సంఘటన జరగగా విషయం బయటకు పొక్కకుండా అధికార వర్గాలు జాగ్రత్త పడ్డాయి. ఘర్షణలో దెబ్బలు తిన్న ఏఈ, మరో లైన్‌మెన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై రెండో పట్టణ ఠాణాకు చేరుకుని అదేరోజు ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదు. మరుసటి రోజు ఏఈకి మద్దతుగా డిప్లొమా ఇంజినీర్ అసోసియేషన్, లైన్‌మెన్‌కు మద్దతుగా 1104 ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎస్‌ఈకి, డీఈకి ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఎస్‌ఈ పీవీ రమేశ్ డీఈని ఆదేశించారు. డీఈ ఏడీతో కలిసి ఈ వ్యవహారంపై వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఘటన ఎండీ వరకు వెళ్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, సస్పెన్షన్ ప్రమాదం లేకపోలేదని భావించిన లైన్‌మెన్ తరఫున యూనియన్ ప్రతినిధులు ఏఈపై ఒత్తిడి తెచ్చి ఫిర్యాదు వెనక్కి తీసుకునేలా రాజీ కుదిర్చినట్లు సమాచారం. ఎస్‌ఈ పీవీ రమేశ్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఘటన జరిగినట్లు తెలిసిందని, విచారణ కోసం డీఈని ఆదేశించామని తెలిపారు.

తెరుచుకున్న సరళాసాగర్ సైఫన్ కవాటాలు

మదనాపురం, న్యూస్‌టుడే : మండలంలోని సరళాసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతంలో విస్తరించిన పెద్ద, బుర్ర వాగుల నుంచి వరద నీరు భారీగా రావడంతో ప్రాజెక్టుకు ఉన్న ఆటోమేటిక్ సైఫన్ల కవాటాలు తెరచుకున్నాయి. మంగళవారం సాయంత్రం ఒక ప్రైమింగ్, రెండు ఉడ్ సైఫన్ కవాటాలు తెరచుకుని నీటిని బయటకు విడుదల చేసింది. సుమారుగా 5 వేల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోందని ప్రాజెక్టు ఏఈఈ రణిల్‌రెడ్డి తెలిపారు. ఈ నీరంతా ఊకచెట్టు వాగు మీదుగా రామన్‌పాడ్ జలాశయానికి చేరుతున్నాయి.

చెంచు పెంటల్లో మౌలిక వసతులు


మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : చెంచు పెంటల్లో జీవనం సాగిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు అందేలా చూడాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో పీఎం జన్‌మన్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు చెంచు పెంటల్లో పూర్తయిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఉన్న 88 ఆదివాసి చెంచు పెంటల్లో ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. 11 రకాల వసతులు తప్పనిసరిగా అందించాలని సూచించారు. వారం రోజుల్లో అందరికి ఆధార్‌కార్డులు అందించాలని ఆదేశించారు. మంజూరైన 890 ఇళ్లు, రహదారులు, తాగునీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్తు కనెక్షన్ల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. చెంచు సభ్యుల జాబితా తయారు చేసి ఆయుష్మాన్ భారత్ కార్డులను ఇవ్వాలని తెలిపారు. అందరికి జన్‌ధన్ ఖాతాలను తెరిపించాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేశ్, డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, డీపీవో రామ్మోహన్‌రావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో వేగంగా సౌర విద్యుత్తు పనులు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో సౌర విద్యుత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ నుంచి విద్యుత్తు శాఖ అధికారులతో కొండారెడ్డిపల్లి సౌర విద్యుత్తు పనులపై గూగుల్ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విద్యుత్తు శాఖ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులతో సమీక్షించారు. సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ మాట్లాడుతూ.. ప్రభుత్వం సౌర విద్యుత్తును వినియోగించుకునే ప్రయత్నంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద కొండరెడ్డిపల్లిని ఎంపిక చేసిందన్నారు. త్వరలో కొండారెడ్డిపల్లిలో పర్యటించి పరిశీలిస్తానని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లిలో గృహ అవసరాలకు సంబంధించిన కనెక్షన్లు 499, వాణిజ్య 66, పరిశ్రమలు 10, వ్యవసాయ కనెక్షన్లు 867 ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటికి కావాల్సిన విద్యుత్తు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రామంలో కుటుంబాల వారీగా పేర్ల నమోదు ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. సౌర విద్యుత్తు పనులను వేగవంతంగా చేయాలన్నారు. సోలార్ ప్రాజెక్టుకు కావాల్సిన భూసేకరణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి నోడల్ అధికారి డా. జీవీ రమేశ్, విద్యుత్తు శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ, శ్రీధర్‌శెట్టి, డీపీవో రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు వేళాయే

నేటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

అచ్చంపేట, రాజోలి, న్యూస్‌టుడే : యువతలోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవాలను నిర్వహిస్తోంది. కలెక్టర్‌ల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీటిని ఈనెల 25 నుంచి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ అంశాల్లో పోటీలు ఉంటాయి.

జానపద నృత్యాలు : పోటీలు రెండు విభాగాల్లో నిర్వహించనున్నారు. ఒక విభాగంలో పదిమందితో కూడిన బృందం 15 నిమిషాలపాటు నృత్య ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. రెండో విభాగంలో 7 నిమిషాల పాటు వ్యక్తిగత ప్రదర్శన ఉంటుంది. వ్యక్తిగత ప్రదర్శనలో గరిష్ఠంగా ఐదుగురు పాల్గొనవచ్చు. **జానపద గేయాలు :** బృందం, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు ఉంటాయి. జానపద గేయాలను 7 నిమిషాల వ్యవధిలో పాడాల్సి ఉంటుంది. **కవిత్వం :** గంట సమయంలో 50 పదాల్లో కవితలు రాయాలి. **వ్యాసరచన :** ఎంపిక చేసిన అంశంపై గంట వ్యవధిలో వెయ్యి పదాల నిడివితో వ్యాసం రాయాలి. **పోస్టర్ తయారీ :** అధికారులు ఇచ్చిన ఇతివృత్తంపై 90 నిమిషాల్లో పోస్టర్ తయారు చేయాలి. **ఉపన్యాస పోటీలు :** లాటరీ ద్వారా ఎంపిక చేసిన అంశాన్ని అభ్యర్థులకు కేటాయిస్తారు. మూడు నిమిషాల్లో ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లం లేదా హిందీలో మాట్లాడాలి. **విజ్ఞాన మేళా :** సైన్స్ మేళాను తొలిసారి నిర్వహిస్తున్నారు. సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలను ప్రదర్శిస్తారు. **హస్త కళల ప్రదర్శన :** హస్త కళలు, దుస్తులు, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు ముఖాముఖిలో పాల్గొంటారు.

మూడు దశల్లో.. : పోటీలను మూడు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఉంటాయి. ప్రతిభ చాటిన వారు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారు. రెండో దశలో రాష్ట్రస్థాయి పోటీలను హైదరాబాద్‌లో నిర్వహిస్తారు. మూడో దశ పోటీలను స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 12-16వ తేదీ వరకు జాతీయస్థాయిలో నిర్వహించనున్నారు.


జానపద నృత్య ప్రదర్శన ఇస్తున్న బాలికలు

దరఖాస్తుల ఆహ్వానం..

ఈనెల 28న జిల్లా కేంద్రంలో నిర్వహించే యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు 15-29 ఏళ్ల వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు రెండు కలర్ ఫొటోలు, ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రం జత చేసి అందజేయాలి.
- సీతారాం, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి, నాగర్‌కర్నూల్

పోటీలు నిర్వహించే వేదికలు

జిల్లా	తేదీ	వేదిక
జోగులాంబ	28	ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల
నాగర్‌కర్నూల్	28	సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్
నారాయణపేట	30	గ్రౌండ్ స్కూల్ స్టేడిహాల్
వనపర్తి	26	ఇండోర్ స్టేడియం, వనపర్తి
మహబూబ్‌నగర్	25	డీఎస్ఏ మైదానంలోని ఇండోర్ స్టేడియం



తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తే చర్యలు: డీకే అరుణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : తిరుమల తిరుపతి పవిత్రతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో మంగళవారం భాజపా సభ్యత్వ కార్యశాల కార్యక్రమం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో నాసిరకం, నెయ్యి వినియోగించినట్లు ధ్రువీకరణ పత్రాలు వెలువడిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, భక్తుల మనోభావాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ అంశాన్ని తీవ్రంగా భావిస్తోందని చెప్పారు. హిందూ ధార్మికతను కాపాడే అంశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు. ఆయా మతాల ధార్మిక, ఆధ్యాత్మిక అంశాలను రాజ్యాంగం పరిధిలో పరిరక్షించేందుకు కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణ, మేర్వ రాజు, పుర ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్ మహేశ్వరి పాల్గొన్నారు.

29న ఎంవీఎస్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ క్రిస్టియన్‌పల్లిలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఈ నెల 29న కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి కెవెస్ రవికుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ఆశయంతో 1965లో మహబూబ్‌నగర్ విద్యా సమితి(ఎంవీఎస్) పేరుతో పల్లెర్ల హనుమంతరావు, డీకే సత్యారెడ్డి, రాంచంద్రా రెడ్డి, సత్తూరు రంగయ్య వంటి ప్రముఖులు కళాశాల స్థాపించారని, 2025 సంవత్సరంలో 60 ఏళ్లు అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనికి గవర్నర్‌తో పాటు ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణారెడ్డి, రాజేంద్రకుమార్, రాజేంద్రప్రసాద్, చంద్రకుమార్ గౌడ్, వినోద్‌కుమార్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగి రిమాండ్

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్‌బీఐలో డబ్బులు స్వాహా చేసిన బ్యాంకు ఉద్యోగికి రిమాండ్ విధించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిందితుడు కిరణ్‌కుమార్ 2018 నుంచి 2023 వరకు బ్యాంకులోని ప్రజల ఖాతాల నుంచి రూ.1,49,50,000 తన భార్య ప్రశాంతితో పాటు మరికొందరి ఖాతాల్లోకి బదిలీ చేశాడు. గుర్తించిన శాఖ మేనేజర్ హుస్సేన్ బాషా ఇదివరకే ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జడ్జి విజయ్‌కుమార్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

చెరువులో పడి కార్మికుడి గల్లంతు

జడ్చర్ల, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ కార్మికుడు చెరువులో పడి గల్లంతైన ఘటన జడ్చర్ల మండలం గోప్లాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ ఆదిరెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తోకల జంగయ్య (65) పంచాయతీలో నీటిసరఫరా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ సమీపంలోని పెద్ద చెరువు లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి వరకు ఆచూకీ లభించలేదని సీఐ తెలిపారు. తిరిగి ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అన్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య, భారాస నాయకులు ఇంతియాజ్, గ్రామ నాయకులు అక్కడకు చేరుకున్నారు.

మండలానికి ఒకే విద్యాధికారి

76 మండలాల్లో బాధ్యతలు చేపట్టనున్న ఎంఈవోలు

పాలమూరు, అచ్చంపేట, నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : మండలానికి ఒకే విద్యాధికారి ఉండేలా ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మండల నోడల్ అధికారు(ఎంఎన్‌వో)లకే మండల విద్యాధికారులుగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఇన్నాళ్లు ఒకే ఇన్‌ఛార్జి ఎంఈవోకు ఎక్కువ మండలాల బాధ్యతలు అప్పగించటంతో పర్యవేక్షణ కొరవడింది. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. కొంతకాలంగా ఉన్నత పాఠశాలల్లోని సీనియర్ జీహెచ్‌ఎంలు మండల నోడల్ అధికారు(ఎంఎన్‌వో)లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా మరికొందరు పనిచేస్తున్నారు. ఇక నుంచి ఒక్కరే ఉండనున్నారు. ఎంఎన్‌వో పోస్టు అనేది ఇక నుంచి ఉండదు. మండలానికి ఎంఈవో మాత్రమే ఉండనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరే రెగ్యులర్ ఎంఈవోలుగా మహబూబ్‌నగర్ అర్బన్‌కు లక్ష్మణ్‌సింగ్, కల్వకుర్తికి శంకర్ ఉన్నారు. కొత్త నియమితులైన వారు 76 మండలాల్లో విద్యాధికారులు పాలన పగ్గాలు చేపట్టనున్నారు. పాఠశాలల పర్యవేక్షణ, తొలిమెట్టు, లిప్ కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఏకరూప దుస్తుల, పాఠ్య పుస్తకాల పంపిణీ, బిల్లుల చెల్లింపు తదితరాలన్నీ వారే నిర్వహిస్తారు. మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా మండలంలో ఇక నుంచి ఎంఈవోనే విద్యకు సంబంధించిన అన్ని రకాల సేవలు అందిస్తారని, వ్యవస్థ గాడినపడుతుందని తెలిపారు.

మండలాల వారీగా ఎంఈవోలు వీరే

జోగులాంబ గద్వాల జిల్లా : ఆర్.ఆశోక్‌కుమార్ (అలంపూర్), రవీంద్రాబాబు (ధరూర్), శ్రీనివాస్‌గౌడ్ (గద్వాల), నల్లారెడ్డి(గట్టు), డి.రాములు (అయిజ), జె.అమీర్‌పాషా (ఇటిక్యాల), కె. వెంకటేశ్వర్‌రావు (కేటీదొడ్డి), జి.సురేశ్ (మల్దకల్), బి.శివప్రసాద్ (మానవపాడు), భగీరథరెడ్డి (రాజోలి), రామకృష్ణ (ఉండవల్లి), బి. నర్సింహ (వడ్డేపల్లి), సి.వెంకటేశ్వర్లు (ఎర్రవల్లి).

మహబూబ్‌నగర్ జిల్లా : కురుమూర్తి (అడ్డాకుల), శంకర్ (బాలానగర్), ఉషారాణి (భూత్పూర్), మురళీకృష్ణ (చిన్నచింతకుంట), బలరామ్ (దేవరకద్ర), జనార్దన్ (గండీడ్), గోపాల్‌నాయక్ (హన్వాడ), మంజుల (జడ్చర్ల), వెంకట్‌జీ (కోయిలకొండ), మంజులత (కౌకుంట్ల), కృష్ణయ్య (మహబూబ్‌నగర్ గ్రామీణం), రాజునాయక్ (ముమ్మదాబాద్), సుధాకర్ (మిడ్జిల్), ఎస్. రాజేశ్వర్‌రెడ్డి (మూసాపేట), నాగ్యానాయక్ (నవాబ్‌పేట), సుధాకర్ (రాజాపూర్).

నాగర్‌కర్నూల్ జిల్లా : పి. జీవన్‌కుమార్ (అచ్చంపేట), ఎ. బాలకృష్ణ (అమ్రాబాద్), వి. విష్ణుమూర్తి (బల్మూర్), ఎన్. రాములు (బిజినేపల్లి), ఆర్. ఝాన్సీరాణి (చారగొండ), ఎం.నిర్మల (కోడేరు), ఇమ్మాన్యూల్(కొల్లాపూర్), బషీర్ అహ్మద్ (లింగాల), కె.భాస్కర్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), బుచ్చిబాబు (పదర), శ్రీనివాస్‌రెడ్డి (పెద్దకొత్తపల్లి), సి.కుర్మయ్య (పెంట్లవల్లి), జి.శ్రీనివాస్‌రెడ్డి (తాడూరు), సి.శ్రీనివాస్‌రెడ్డి (తెల్కపల్లి), సత్యనారాయణ (తిమ్మాజీపేట), చంద్రశేఖర్ (ఉప్పునుంతల), మురళీమోహన్ (ఉర్కొండ), మురళీ మనోహరాచారి (వంగూరు), ఎస్. చంద్రుడు (వెల్దండ).



కోయిలకొండలోని మండల వనరుల కేంద్రం

నారాయణపేట జిల్లా : ఎస్.కృష్ణారెడ్డి (దామరగిద్ద), ఎం. గాయత్రి (ధన్వాడ), ఎం.శేఖర్‌రెడ్డి (గుండ్‌మాల్), శేఖర్‌నాయక్ (కోస్గి), ఆర్.ఆంజనేయులు (కొత్తపల్లి), నిజామోద్దీన్ (కృష్ణా), బాలకిష్టప్ప (మద్దూర్), మురళీధర్‌రెడ్డి (మాగనూరు), అనిల్‌గౌడ్ (మక్తల్), మనోరంజనీ (మరికల్), బాలాజీ (నారాయణపేట), ఎన్.రామకృష్ణ (నర్వ), కె.రాంచంద్రాచారి (ఉట్కూర్).

వనపర్తి జిల్లా.. : భాస్కర్‌సింగ్ (అమరచింత), బాలరాజు (ఆత్మకూర్), గణేశ్‌కుమార్ (చిన్నంబావి), పి.జయశంకర్ (ఘన్‌పూర్), కె.శ్రీనివాస్‌గౌడ్ (గోపాల్‌పేట్), జె.కృష్ణయ్య (కొత్తకోట), ఫరూఖ్ హుస్సేన్ (మదనాపూర్), శ్రీనివాసులు (పాన్‌గల్), ఎస్.జయరాములు (పెబ్బేరు), బి.విష్ణు (పెద్దమందడి), ప్రసాద్ (రేవల్లి), హన్మంతు (శ్రీరంగాపూర్), మద్దిలేటి (వనపర్తి), నర్సింహ (వీపనగండ్ల), జి.బుచ్చిరెడ్డి (ఎదుల్లా).

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

వేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు


నాగర్‌కర్నూల్: 7993300530 కల్వకుర్తి: 9908803650
అచ్చంపేట: 8008573927 కొల్లాపూర్: 8008573869



సమస్య: కొల్లాపూర్‌లోని 5వ వార్డులో హిందూ శ్మశాన వాటికకు వెళ్లే దారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి, వీధిదీపాలు సైతం లేవు. -పులి భరత్

సమాధానం: శానిటరీ సెక్షన్ అధికారికి చెప్పి తొలగించేలా చూస్తా. - శ్రీనివాసన్, పుర కమిషనర్

- న్యూస్‌టుడే, కొల్లాపూర్ పట్టణం



జలాశయం కట్టపై కంప చెట్లు



దారిపైకి చొచ్చుకొచ్చిన చెట్ల కొమ్మలు

జొన్నలబొగుడ జలాశయం నిర్వహణ అస్తవ్యస్తం

కోడేరు, కొల్లాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జొన్నలబొగుడ ఎత్తిపోతల జలాశయం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిధుల సమస్యతో ఎనిమిదేళ్లుగా పట్టించుకోకపోవడం వల్ల కట్ట వెంట కంపచెట్లు పెరిగి ద్విచక్రవాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చెట్ల వేర్లు కట్టలోకి చొచ్చుకుపోవడంతో జలాశయం పటిష్టత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఏదైన ప్రమాదం జరిగితే మూడో ఎత్తిపోతలతో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు సాగునీరు నిలిచిపోనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి ఈఈ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. జలాశయాన్ని సందర్శించామని, చెట్ల తొలగింపునకు నివేదిక పంపుతామని చెప్పారు. నిధులు రాగానే పనులు చేస్తామని తెలిపారు.

ప్రాజెక్టులను సందర్శించనున్న మంత్రుల బృందం

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి జలాశయాలను మంత్రుల బృందం ఈనెల 25న సందర్శించనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ఆబ్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాజెక్టులను సందర్శిస్తారని చెప్పారు. కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు జలాశయం, బిజినేపల్లి మండలంలోని వట్టెం జలాశయాలను పరిశీలిస్తారన్నారు. సాయంత్రం సమీకృత కలెక్టరేట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

సర్దుబాటు ప్రక్రియపై పునరాలోచించాలి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై పునరాలోచించాలని ధర్మా ఉపాధ్యాయ సంఘం (డీటీయూ) జిల్లా అధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. సంఘం నాయకులు మంగళవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో ఏవో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. జీవో నం.317తో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. నాయకులు జానయ్య, సైదులు, ఆంజనేయులు, తిరుపతయ్య, కోటయ్య, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రో.: మత్తు వదలరా 2
కల్వకుర్తిలో.. పార్థసారథి: ఉత్సవం

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 26, వంకాయ 40, బెండ 40, మిరప 50, కాకర 64, బీర 58, క్యాలీఫ్లవర్ 64, క్యాబేజీ 40, క్యారెట్ 64, దొండ 40, ఆలుగడ్డ 42, ఉల్లిగడ్డ 48, గోకర 64, దోస 40, ఆనంకాయ 16, చిక్కుడు 64, బీట్‌రూట్ 50, ఖీర, 40, బీన్స్ 90

రోగులను భయపెడుతున్న ఆసుపత్రి



ఫ్యాను వద్ద పెచ్చులూడిన వైనం

కొల్లాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : రోగాల నయం కోసం పెద్దకొత్తపల్లి పీహెచ్‌సీకి వెళ్లిన వారు భయాందోళనకు గురవుతున్నారు. వార్డుల్లో పైకప్పు శిథిలావస్థకు చేరి వర్షం నీరు కురుస్తోంది. గత నెలలో పైకప్పు పెచ్చులూడి ఫ్యాన్‌పై పడింది. ఆ సమయంలో రోగులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొత్తభవనం కోసం గతంలో ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారి విజయ్ తెలిపారు.

నీటి సరఫరాపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు

అచ్చంపేట న్యూటౌన్, లింగాల, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో భగీరథ నీటి సరఫరాపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు సూచించారు. అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్ మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సిబ్బందికి మోటార్ల నిర్వహణ, విద్యుత్తు వినియోగం, నీటి నాణ్యత, చేతిపంపుల మరమ్మతులపై అవగాహన అవసరమన్నారు. గ్రిడ్ ఈఈ సుధాకర్‌సింగ్, డీఈ హేమలత, ఏఈలు మధుబాబు, సందీప్ పాల్గొన్నారు.

రుణాలు ఇవ్వాలని ధర్నా



ధర్నా చేస్తున్న భాజపా నేతలు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : రైతులకు రుణాలివ్వాలని పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎదుట భాజపా ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. భాజపా మండల అధ్యక్షుడు పదిర బీమేష్ మాట్లాడుతూ.. బ్యాంకులో గతంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలన్నారు. శివ, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షీటీం అదుపులో పోకిరీలు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : పట్టెంలో పాఠశాల విద్యార్థినులను అల్లరిచేస్తూ, ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న పోకిరీలను అదుపులోకి తీసుకున్నట్లు షీటీం ఇన్‌ఛార్జి ఏఎస్సై విజ్ఞయలక్ష్మి తెలిపారు. కొంతకాలంగా పలువురు బాలురు పాఠశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష

కందనూలు, న్యూస్‌టుడే : కోడేరు మండలం నాగులపల్లికి చెందిన భాస్కర్, నాగర్‌కర్నూల్ మండలం అవురాశిపల్లికి చెందిన కాశీం ఈనెల 22న మద్యం తాగి వాహనం నడిపారు. పోలీసులు తనిఖీ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. మంగళవారం న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి వి. రామయ్య ఒక్కొక్కరికి రూ. 2,100 చొప్పున జరిమానా, ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై గోవర్దన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కందనూలు, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ పట్టణంలోని నాగనూల్ బీసీ కాలనీకి చెందిన సాయి (25) ప్రధాన రహదారి పక్కన ఉన్న పాదబాటపై తాళాలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరి లేని సమయంలో మంగళవారం సాయంత్రం ఫ్యానుకు ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతడికి నెల రోజుల క్రితం వివాహమైంది. కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్సై గోవర్దన్ పేర్కొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగం అనర్థదాయకం

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : పొగాకు, గుట్కా వినియోగంతో ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని తిమ్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఇస్మాయిల్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. గుట్కా, పొగాకుకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు అనసూయ, వైద్య సిబ్బంది బాల్‌రాజ్, చంద్రకళ, మునికుమారి, కళాశాల అధ్యాపకులు వెంకన్న, వెంకటయ్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దస్త్రాలు అప్పగిస్తేనే సజావుగా విచారణ

కల్వకుర్తి, న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి ఆరోపణలకు సంబంధించిన దస్త్రాలను అప్పగించక పోవటంతో విచారణ వాయిదా వేస్తున్నట్లు డీఆర్‌డీవో అంబుడ్స్‌మన్ జంగయ్య తెలిపారు. మంగళవారం తర్నికల్ గ్రామంలో ఉపాధి పథకంలో కూలీలు చేసిన పనులకు డబ్బులు చెల్లించకపోవడంపై వచ్చిన ఫిర్యాదుపై గ్రామంలో మూడోసారి విచారణ చేపట్టినా ఫలితం లేకపోయిందని ఆయన వాపోయారు. కూలీలకు చెల్లించాల్సిన డబ్బుల వివరాలకు సంబంధించిన దస్త్రాలను పంచాయతీ కార్యదర్శి, ఉపాధి పథకం క్షేత్రసహాయకుడు పూర్తి స్థాయిలో అందించడం లేదన్నారు. విచారణ వివరాలను జిల్లా అధికారులకు వివరిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి హరిణి, ఉపాధి పథకం సిబ్బంది, భారాస నాయకుడు, సురేశ్‌గౌడ్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

కందనూలు, న్యూస్‌టుడే : మహిళలపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గీత డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సమస్యలపై చర్చించడానికి ఈనెల 29న జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు నిర్మల, కార్యకర్తలు వెంకటమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



ఊర్కొండలో విద్యార్థినులకు బూట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, న్యూస్‌టుడే : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, వసతుల కల్పనకు రూ. 18 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని జడ్చర్ల శాసనసభ్యుడు అనిరుధ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ఊర్కొండపేట, ఇప్పపహాడ్, జకినాలపల్లి, బొమ్మరాశిపల్లి, జగబోయిన్‌పల్లి, బాల్యలో క్యతండా, రాంరెడ్డిపల్లి, ముచ్చర్లపల్లి, రాచాలపల్లి, మాదారం, గుడిగాన్‌పల్లి, రేవల్లి, తిమ్మన్నపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సొంత నిధులతో బూట్లు పంపిణీ చేసి మాట్లాడారు. వర్షం వస్తే తండాకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రోడ్డు నిర్మాణం చేపట్టాలని బుర్వానికుంటతండా వాసులు ఎమ్మెల్యేను కోరారు. ఊర్కొండపేట గ్రామానికి చెందిన మహిళలు రూ. 2 లక్షల రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. తహసీల్దార్ రాంకోటి, ఎంఈవో శంకర్‌నాయక్, ఆనంద్, మురళీమోహన్‌గౌడ్, శ్రీరాములు, బాద్మి శివకుమార్, వెంకటయ్యగౌడ్, నిఖిల్‌రెడ్డి, విజయుడు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

- ఊర్కొండ గ్రామానికి చెందిన యువకుడు గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మతిస్థిమితం కోల్పోయిన శంకర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.
- బొమ్మరాశిపల్లి, జగబోయిన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంల్లో పోషణ్ అభియాన్‌లో భాగంగా కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పలువురు చిన్నారులకు ఆయన అన్నప్రాశన చేశారు.

పాఠశాల విద్యార్థి మృతి

కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల ధర్నా



యశ్వంత్

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నర్సరీ చదువుతున్న యశ్వంత్(5) అనారోగ్యంతో మృతిచెందాడు. బంధువులు, పాఠశాల యాజమాన్యం కథనం ప్రకారం.. పూడూరు గ్రామానికి చెందిన మాధవి, గోపీ దంపతుల కొడుకు యశ్వంత్ నాలుగుగైదు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఎప్పటిలాగే బస్సులో పాఠశాలకు వచ్చాడు. సాయంత్రం మళ్లీ జ్వరం రావడంతో తరగతి ఉపాధ్యాయిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పాఠశాల సమయం ముగియగానే బస్సులో వెళ్తుండగా ఫిట్స్ రావడంతో డ్రైవర్ వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చేర్పించాడు. ఆస్పత్రిలోనే బాబు మృతిచెందాడు. వైద్యులు చికిత్స అందించడంలో ఆలస్యం కావడం వల్లే చిన్నారి మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. అనంతరం మృతదేహాన్ని తీసుకుని పాఠశాల ముందు రాత్రి 11 గంటల వరకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకోవడం మృతదేహాన్ని తిరిగి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థి మృతికి తమకెలాంటి సంబంధం లేదని, అనారోగ్య విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశామని కరస్పాండెంట్ తెలిపారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం లేదని వైద్యులు వివరణ ఇచ్చారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా

తాడూరు, న్యూస్‌టుడే : మండలంలో పని చేస్తున్న ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)పై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం కేవీపీఎస్, దళిత సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీపై ఇటీవల మండలానికి వచ్చిన ఆర్ఐ అనేక షరతులు విధిస్తూ అర్జీదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. కులం, ఆదాయం, తదితర దస్త్రాల కోసం వచ్చిన వారిని వివిధ కారణాలతో రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం సరికాదన్నారు. వెంటనే ఆర్ఐపై చర్యలు తీసుకోవాలంటూ నయాబ్ తహసీల్దార్ మహమ్మద్ అలీకి వినతి పత్రం అందజేశారు. నాయకులు కాశన్న, బాల వెంకటయ్య, బాలు, పరశురాములు, రాజు, భీమయ్య, కురుమూర్తి పాల్గొన్నారు.

'స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకుందాం'



నాగర్‌కర్నూల్ : ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ దేవ సహాయం, పుర ఛైర్‌పర్సన్ కల్పన

కందనూలు, న్యూస్‌టుడే : స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకునేందుకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం అన్నారు. మంగళవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పుర అధ్యక్షురాలు కల్పన, కమిషనర్ నరేశ్ బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పురపాలక అధ్యక్షురాలు రమ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయం వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పుర ఆటోలో వేయాలన్నారు. పుర కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు రహీం, నయీం, అలివేలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీలో పుర అధ్యక్షురాలు రమ్య

ఎస్పీకి చేరిన నివేదిక

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని నల్లవెల్లి ప్రధాన రహదారి పక్కన మే 15న ఓ వ్యక్తి కారులో తన స్నేహితురాలితో కలిసి భోజనం చేస్తుండగా ఓ కానిస్టేబుల్ ఫొటో తీసి వారిని బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. దీనిపై సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు పూర్తి స్థాయిలో వివరాలు సేకరించారు. సంఘటనకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు పంపించినట్లు సీఐ కనకయ్య తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో శుద్ధ జలం సరఫరాకు వినతి

అచ్చంపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శుద్ధ జలం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్ అన్నారు. ప్రభుత్వం తాగునీటిని సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారని చెప్పారు. అన్ని సర్కారు బడుల్లో శుద్ధ జలం సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలని..

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ నుంచి నార్లాపూర్ మీదుగా లింగాల మండలానికి బస్సు ఏర్పాటు చేయాలని చంద్రబండతండా, నార్లాపూర్ గ్రామస్థులు మంగళవారం ఆర్టీసీ డీఎం ఉమాశంకర్‌కు వినతిపత్రం అందించారు. కొల్లాపూర్ నుంచి లింగాలకు కొత్తగా రహదారి నిర్మించినందున ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. శంకర్‌నాయక్, రామన్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, మహేష్, నాగరాజు, హేమ్లానాయక్, బాలాజీనాయక్, ప్రసాద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త స్థానాల్లో చేరేలా చర్యలు

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఈ ఏడాది జులై మొదటి వారంలో బదిలీ అయిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు వెంటనే కొత్త స్థానాల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. విధుల్లో చేరాకే సర్దుబాటు చేపట్టాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 46 దాటితే ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు.

విద్యార్థి దశ నుంచి అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయమూర్తి పుట్ట మౌనిక

తాడూరు, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పుట్ట మౌనిక అన్నారు. మండలంలోని ఐతోల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతోనే గుర్తింపు వస్తుందని, ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. మంచి విషయాలకు మాత్రమే చరవాణి, అంతర్జాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 28న నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీహెచ్ఎం భాస్కర్‌రెడ్డి, సీఐ కనకయ్యగౌడ్, న్యాయవాదులు మధుసూదన్‌రావు, బాబుపియర్, శ్యామ్‌ప్రసాద్‌రావు, కేశవరెడ్డి, రాజు, బాలగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : పౌష్టికాహారం తీసుకొని, క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి నయమవుతుందని మన్ననూరు అపోలో టోటల్ హెల్త్ ప్రతినిధులు రాంబాబు, హరిత అన్నారు. మన్ననూరులోని అపోలో ఆసుపత్రి ఆవరణలో మంగళవారం అమ్రాబాద్, పదర మండలాలకు చెందిన 25 మంది వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేసి మాట్లాడారు. టీబీ పర్యవేక్షకుడు ఆరీఫ్‌ఖాన్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో..

వంగూరు, న్యూస్‌టుడే : పౌష్టికాహారం అందించడమే లక్ష్యమని కల్వకుర్తి ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ అన్నారు. మంగళవారం వంగూరు, మిట్టసదగోడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌వో సుధాకర్, సూపర్‌వైజర్ దేవమ్మ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల వివరాలను నమోదు చేసే సిబ్బందికి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని బాధితులు దశరథం, సత్యనారాయణ కోరారు. 7 మంది 16 నెలలుగా విధులు నిర్వహిస్తున్నా అధికారులు స్పందించడం లేదని మంగళవారం ఆసుపత్రిలో నిరసన తెలిపారు.

ఐటీఐలో దరఖాస్తులకు ఆహ్వానం

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జయమ్మ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 28 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలలో ప్రవేశాలు పొందాలన్నారు.

విద్యార్థులకు సేవాభావం అవసరం



అమ్రాబాద్: మాట్లాడుతున్న ప్రధానాచార్యులు మదన్‌మోహన్

అమ్రాబాద్, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం అలవరుచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మదన్ మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్, మద్యపాన నిషేధానికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చంద్రయ్య, అధ్యాపకులు గోపాల్, డాక్టర్ రాధ, శంకరయ్య పాల్గొన్నారు.

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : యువతతోనే దేశ పురోగతి సాధ్యమని పీజీ, డిగ్రీ కళాశాలల ప్రధానాచార్యులు మార్క్‌పోలోనియస్, ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ మాజీ పీవో కురుమయ్య, సంతోష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కందనూలు, న్యూస్‌టుడే : ఏదైనా సంఘటన జరిగినప్పుడు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరు సకాలంలో స్పందించి సాయం చేయాలని పట్టణంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు సూచించారు. పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో మంగళవారం జాతీయ సేవా పథకం (ఎన్నెస్సెస్) దినోత్సవం పురస్కరించుకొని పలు విషయాలను విద్యార్థులు నాటిక రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కళాశాల నుంచి ప్రయాణ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ షాజహాన్ సుల్తానా, సమన్వయకర్త రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కందనూలు, న్యూస్‌టుడే : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత ఈనెల 16న భర్తకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : అదనపు కట్నం వేధింపుల ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మిపల్లికి చెందిన రాధ, వనపర్తి మండలం శ్రీనివాసపురానికి చెందిన తిరుపతయ్య మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. సుమారు రెండేళ్లుగా అదనపు కట్నం కింద బంగారం తీసుకురావాలని భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు మంగళవారం తిరుపతయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : మండలంలోని వెల్టూరులో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం మంగళవారం పట్టుకున్నారు. బిల్లకంటి వెంకటేశ్వర్లు ఇంట్లో 2.50 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్ హేమ్లా చెప్పారు. ఏఎస్సై సుజ్ఞానం పంచనామా నిర్వహించారని, డీటీ ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

మామిడి సాగులో యాజమాన్య పద్ధతులపై సదస్సు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు సరిగ్గా పాటించాలని జిల్లా ఉద్యానవన అధికారి జగన్ అన్నారు. మండలంలోని చెన్నపురావుపల్లిలో మామిడి సాగులో యాజమాన్య పద్ధతులపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 57వేల ఎకరాల మేర మామిడి సాగు అవుతోందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధికారి లక్ష్మణ్, రాకేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు శివారులోని వెల్లటూరు కాలనీలో బ్రిక్స్ వ్యాపారి తమ్మిశెట్టి వెంకయ్య ఇంట్లో ఈ నెల 19వ తేదీ తెల్లవారుజామున దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుల నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.38 వేల నగదు, నేరానికి వినియోగించిన కారుతో పాటు ఐదు చరవాణిలు, ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేమవరపు నాగరాజు, వేమవరపు పుల్లారావు, భిక్షాలు, నల్గొండ జిల్లా వాసి రమావత్ మాత్య, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చిక్కుల ఆంజనేయులు, మేళ్లచెరువుకు చెందిన వేముల వెంకటేశ్వర్లు మొత్తం ఆరుగురు ఒక ముఠాగా ఏర్పడి ఈ నెల 19న వెల్లటూరులోని బ్రిక్స్ వ్యాపారి ఇంటి తలుపులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించారు. కత్తులతో బెదిరించి వ్యాపారి వెంకయ్య, అతని ఇద్దరు కుమార్తెలను బెదిరించి వారి ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి తన సిబ్బందితో అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు కారులో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. విచారించడంతో వెల్లటూరుతో దోపిడీకి పాల్పడినట్లు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. వేముల వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నాడు. ఈ కేసులో కీలక సమాచారం అందించిన ఆటో డ్రైవర్ తిరుపతయ్యను ఎస్పీ సన్మానించారు. కేసు ఛేదనకు కృషిచేసిన అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రజితా రెడ్డి, మేళ్లచెరువు, అనంతగిరి, కోదాడ గ్రామీణ, చింతలపాలెం ఎస్సైలు పరమేశ్, నవీన్, అనిల్‌రెడ్డి, సైదిరెడ్డి, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.